సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



మరణంలోనూ తోడుగా..

భర్త మృతి వార్త తెలిసిన గంట వ్యవధిలోనే భార్య గుండెపోటుతో మృతి చెందిన సంఘటన స్టేషన్ తిమ్మాపూర్‌లో జరిగింది. 8లో▸



మహిళ దారుణ హత్య

మహిళను దారుణంగా హతమార్చి, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన సంఘటన మీర్‌పేట పీఎస్ పరిధిలో జరిగింది. 8లో▸



'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

భూ కబ్జాపై విచారణ



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్: కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికార యంత్రాంగం కదిలింది. కనకమామిడి రెవెన్యూలో ఓ మాజీ మంత్రి పట్టా భూమిలో ఫాంహౌస్ నిర్మిస్తూ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వైనంపై ప్రభుత్వ భూమిలో దు'పట్టా' శీర్షికన గురువారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, సర్వేయర్ రవీందర్, వీఆర్‌ఏ మహేందర్ కనకమామిడి రెవెన్యూలోని సర్వేనెంబర్ 510లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించారు. సర్వే చేసి ఫాంహౌస్ ప్రహరీ, రెండు గదులు ప్రభుత్వ భూమిలో నిర్మించారని నిర్ధారించారు. ప్రభుత్వభూమిని చదును చేశారని గుర్తించారు. ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను, ఫెన్సింగ్‌ను రెండు రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. లేదంటే తామే జేసీబీతో పూర్తిగా ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతం అన్నారు. మరోవైపు ప్రభుత్వ భూమి కబ్జాపై ఇంటలిజెన్స్ వర్గాలు ఆరా తీసినట్టు తెలిసింది. పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం.

గురుకులాల్లో ప్రవేశాలకు మూడో జాబితా విడుదల

మొయినాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు మూడో విడత జాబితా విడుదలైనట్లు రంగారెడ్డి, హైదరాబాద్ గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలకోసం ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు trwreir.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించి ఫలితాలను చూసుకోవాలని సూచించారు.

పర్మినెంట్ చేసే వరకు ఉద్యమం ఆపేది లేదు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

ఇబ్రహీంపట్నం రూరల్: రెండో ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేసే వరకు ఉద్యమం ఆపేది లేదని సంఘం జిల్లా అధ్యక్షురాలు జె.పద్మ స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఎదుట రెండో రోజు సమ్మెలో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 16 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వారిని నిర్దాక్షిణ్యంగా ప్రభుత్వం తొలగించాలని చూస్తే సహించేది లేదన్నారు. తమ హక్కులను కాపాడుకోవడానికి ఎన్ని త్యాగాలకైనా సిద్ధమన్నారు. ఉద్యమ సమయంలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేడు మాట తప్పిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సువర్ణ, మణెమ్మ, సుజాత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆమనగల్లుకు మంత్రి నిరంజన్‌రెడ్డి రాక

ఆమనగల్లు: వ్యవసాయ శాఖామంత్రి నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఆమనగల్లుకు వస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మార్కెట్‌యార్డులో రూ.65 లక్షలతో నూతనంగా నిర్మించే 8 దుకాణాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతుల సౌకర్యార్థం దుకాణ సముదాయం నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, గోరటి వెంకన్న, సురభి వాణీదేవి హాజరవుతున్నట్లు చెప్పారు.

రేపు ఆరుట్లలో ఉచిత న్యాయ శిబిరం

మంచాల: మండల పరిధిలోని ఆరుట్లలో ఈ నెల 19న ఉచిత న్యాయ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లీప్స్–గ్రామీణ న్యాయపీఠం, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో ప్రముఖ భూచట్టాల న్యాయ నిపుణుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి.నిరూప్‌రెడ్డి, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి హాజరవుతారని తెలిపారు.

సంక్షేమానికి పెద్దపీట

- హామీలన్నీ అమలు చేస్తున్నాం
- అభివృద్ధి ఘనత సీఎం కేసీఆర్‌దే
- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు
- జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



మహిళలకు రుణాలు పంపిణీ చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: మహిళాభివృద్ధి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి గురువారం నియోజకవర్గంలో రూ.68.21 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బొంగ్లూర్ క్రాస్ రోడ్డు వద్ద ఓ ఫంక్షన్‌హాల్ జరిగిన మహిళా సంఘాల సమావేశంలో సుమారు రూ.వంద కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను నెరవేరుస్తున్నారని చెప్పారు. బిడ్డ కడుపులో పడగానే న్యూట్రిషియన్ కిట్, పుట్టగానే కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి, అమ్మఒడి పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్రంలో 200 మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో 30 శాతం ప్రసవాలు మాత్రమే సర్కార్ ఆస్పత్రుల్లో జరిగితే బీఆర్‌ఎస్ హయంలో నేడు 72.8 శాతం జరుగుతున్నాయన్నారు. ఆస్పత్రుల పనితీరు మెరుగుపడ్డాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. మిషన్ భగీరథ పథకంతో అక్కాచెల్లెళ్లకు తాగునీటి కష్టాలు లేకుండా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మి కింద రూ.లక్ష సాయం, గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు మహిళల ఖాతాల్లో జమచేస్తున్నట్లు చెప్పారు. రైతుబంధు, ఆసరా పింఛన్ల కింద ఇచ్చే డబ్బులను పెంచిన సంగతిని గుర్తు చేశారు. 1,200 గురుకులాలు, 80 మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలు రాష్ట్రంలో ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. అభయ హస్తం కింద జిల్లాలో 89 వేల మందికి రావాల్సిన డబ్బులను రెండుమూడు రోజుల్లో వారి ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల మధ్య మరో పెద్ద ప్రభుత్వాస్పత్రి నెలకొల్పనున్నట్లు హరీశ్‌రావు వెల్లడించారు. అబ్దుల్లాపూర్‌మెట్, దండుమైలారంలో ప్రత్యేకంగా మహిళా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కిషన్‌రెడ్డిని, సీఎంగా కేసీఆర్‌ను ఆశీర్వదించాలన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.2,930 కోట్లతో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, పార్టీ నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

650 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

అబ్దుల్లాపూర్‌మెట్: అత్యాధునిక వైద్య పరికరాలు, 650 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో కూడిన మెడికల్ కాలేజీని ఇబ్రహీంపట్నం–మహేశ్వరం నియోజకవర్గాల సరిహద్దులో ప్రజలకు అందుబాటులో ఉండేలా త్వరలో నిర్మించనున్నట్లు మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. మండల కేంద్రంలో రూ.2.25కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయంతో పాటు రూ.5.65 కోట్లతో నిర్మిస్తున్న లష్కర్‌గూడ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఇబ్రహీంపట్నంలో డయాలసిస్, ఐసీయూ కేంద్రాలతో కూడిన 100 పడకల ఆస్పత్రిని త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. అంతకుముందు తహసీల్దార్ అశోక్‌రెడ్డిని నూతన కార్యాలయంలో కుర్చీలో కూర్చోబెట్టారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, కలెక్టర్ హరీశ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో ఆరోగ్య తెలంగాణ



మహేశ్వరంలో ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మహేశ్వరం: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఆరోగ్య తెలంగాణగా మారిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో రూ.4 కోట్లతో నిర్మించిన 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనంతో పాటు ఆక్సిజ్ ప్లాంటును ఆయన మంత్రి సబితారెడ్డితో కలిసి ప్రారంభించారు. గడికోట సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో 550 పడకల మెడికల్ కాలేజీని ముఖ్యమంత్రి మంజూరు చేశారని గుర్తు చేశారు. మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో కావాల్సిన వైద్యులను నియమించి, డిజిటల్ ఎక్స్‌రే మిషన్, అల్ట్రాసౌండ్‌ను మంజూరు చేస్తున్నామని తెలిపారు. అమీర్‌పేట్, మన్సాన్‌పల్లి, కొళ్లపడకల్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు సీఎం దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు మహేశ్వరం గేటు నుంచి భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, తెలంగాణ వైద్య, విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, జాయింట్ కమిషనర్ రమేష్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

వచ్చే ఎన్నికల్లో గెలుపు మనదే

- చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయండి
- కార్యకర్తలకు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపు

షాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. చేవెళ్ల గడ్డపై నిర్వహించే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆన్‌మోల్ గార్డెన్‌లో గురువారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 24న చేవెళ్లలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్ల తెలిపారు. కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే కర్ణాటక తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో స్థానికులకే ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తలు నిరంతరం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వహణ సభ్యుడు పామెన భీంభరత్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎస్. రాంరెడ్డి, మెంబర్ షాబాద్ దర్శన్, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, దేశమల్ల ఆంజనేయులు, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు అశ్విని తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభకు తరలిరావాలి

శంకర్‌పల్లి: చేవెళ్లలో నిర్వహించే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక నాయకులతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి నుంచే కార్యకర్తలు ఎన్నికలకు సన్నద్ధం కావాలని అన్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. లక్షల మందితో చేవెళ్ల సభను విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, సీనియర్ నాయకుడు ఉదయమోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు ఇంపుల సత్యనారాయణరెడ్డి, సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, భీంభరత్ పాల్గొన్నారు.

కత్తెర పురుగుతో జర జాగ్రత్త

తలకొండపల్లి: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఖానాపూర్‌లో గురువారం ఏఓ రాజుతో కలిసి పత్తి, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కత్తెర పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. హిమామెక్టిన్ బెంజాయిట్‌ను లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలని సూచించారు. కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరానికి మూడు కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 2జీ గుళికలను వేయాలన్నారు. 10 కిలోల తవుడుతో పాటు 2 కిలోల బెల్లంలో నీరు కలిపి ఒకరోజు నానబెట్టి 100 గ్రాముల తయోడికార్బ్ కలిపి చిన్నచిన్న ఉండలుగా చేసి చెట్టు మొదలు దగ్గర వేయాలన్నారు. అనంతరం పత్తి పంట అధిక దిగుబడి వచ్చేందుకు రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. పంట నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ రాజు, ఏఈఓ శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న బొక్క నర్సింహారెడ్డి

ఓట్లు దండుకోవడానికే పథకాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పథకాల పేరుతో ఓట్లు దండుకోవడానికే సీఎం కేసీఆర్ ఎత్తులు వేస్తున్నారు తప్ప ప్రజా సమస్యలపై ఆయనకు చిత్తశుద్ధి లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి విమర్శించారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం పార్టీ మండల అధ్యక్షుడు అనేగౌని అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదేళ్లపాటు డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్‌కార్డులు, వృద్ధులకు పింఛన్లు ఇవ్వని ప్రభుత్వానికి ఎన్నికలు సమీపిస్తున్న వేళ హఠాత్తుగా ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. దళిత, బీసీ బంధు పేరుతో వారి పార్టీ నాయకుల జేబులు నింపడానికే తప్ప అర్హులైన లబ్ధిదారులకు కాదని ఆరోపించారు. ప్రజలు వాస్తవాలు గ్రహించాలన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించే వరకు వారి పక్షాన పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కొత్తగూడ, గుమ్మడవెల్లి సర్పంచులు సాధ మల్లారెడ్డి, గౌర ప్రభాకర్, ఎంపీటీసీ బక్క మల్లేశ్, డైరెక్టర్ పర్వతాలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీరత్వానికి ప్రతీక సర్వాయి పాపన్నగౌడ్

- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- చేవెళ్లలో పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

చేవెళ్ల: తెలంగాణ వీరత్వానికి ప్రతీకగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నిలుస్తారని, అలాంటి మహనీయుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆయన ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్ల, జాగీర్దార్ల అరాచకాలను సహించలేక కదుపుమండి కత్తి పట్టిన వీరుడని.. దళిత, బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని సబ్బండ వర్గాలను ఏకం చేసిన మహనీయుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత అన్ని కులవృత్తులకు సమన్యాయం చేస్తున్నారన్నారు. ఎవరైనా గీత కార్మికుడు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడిపోయి చనిపోతే రూ.5లక్షల బీమా పరిహారం అందిస్తున్నట్టు చెప్పారు. త్వరలో ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గౌడ వృత్తికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా బీఆర్‌ఎస్ చేస్తోందని తెలిపారు. అంతకు ముందు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు, మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, అంబాల నారాయణ, వెంకన్నగౌడ్, చక్రవర్తిగౌడ్, పల్లె రవి, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, సర్పంచ్ బి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంలో పేరులేదని..

- మహిళా కౌన్సిలర్ ఆగ్రహం
- శిలాఫలకాన్ని ధ్వంసం చేసే యత్నం
- పలు సెక్షన్ల కింద కేసుల నమోదు, బెయిల్‌పై విడుదల



శిలాఫలకం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ మంగమ్మ

తుర్కయంజాల్: మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి ప్రారంభించనున్న పనుల శిలాఫలకంలో తమ పేరు లేదని ఓ మహిళా కౌన్సిలర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకం ధ్వంసం చేసే యత్నం చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాగర్ రహదారి నుంచి నాదర్‌గుల్ మీదుగా బార్కస్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి రాగన్నగూడలోని 20వ వార్డులో శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఈ పనులను మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. శిలాఫలకంలో రోడ్డు వెళ్లేటువంటి 21, 11, 10, 12 వార్డుల కౌన్సిలర్ల పేర్లను కాకుండా అధికారులు కేవలం 20వ వార్డు కౌన్సిలర్ పేరును మాత్రమే చేర్చారు. దీంతో ఆగ్రహించిన 21వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మంగమ్మ ఆమె భర్తతో కలిసి శిలాఫలకాన్ని ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆమెతో పాటు భర్త శివకుమార్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజా ఆస్తులకు నష్టం కలిగించే దుశ్చర్యకు పాల్పడినందుకు గాను సెక్షన్లు 3, 4తో పాటు ఐపీసీ సెక్షన్ 353 కింద కేసులు నమోదు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై బయటికి వచ్చారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి

కలెక్టర్ హరీశ్



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టాలని కలెక్టర్ హరీశ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం పోలీస్, ఎక్సైజ్, అటవీ, వ్యవసాయ, రెవెన్యూ ఇతర శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు, మాదకద్రవ్యాల నియంత్రణకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా చేసినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సీజన్‌లో ఎవరైనా రైతులు గంజాయి సాగు చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు రైతుబంధును నిలిపివేయడం జరుగుతుందన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారిని గుర్తించి మానసిక వైద్యులతో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, రైతు వేదికల్లో రైతులకు మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో డీఈఓ సుశీందర్‌రావు, డీసీపీ మురళీధర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



దొరవారి బంగ్లా @100

నేడు అత్యాధునిక టెక్నాలజీతో ఆకర్షణీయమైన డిజైన్లు, పెయింట్లతో పెద్ద పెద్ద కట్టడాలు కడుతున్నప్పటికీ.. పురాతన కాలంలో నిర్మించిన చారిత్రక భవనాల ముందు అవి దిగదుడుపే అని చెప్పాలి.. దీని ఉత్తమ ఉదాహరణ లోయపల్లిలోని శ్రీప్రగడ శ్రీనివాస్‌రావు బంగ్లా. దీనినే దొరవారి బంగ్లా అని కూడా పిలుస్తారు. అప్పట్లో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ బంగ్లాలో కింద 11 గదులు, పైన 12 గదులతో పాటు అందమైన హాల్‌ను ఏర్పాటు చేశారు. శ్రీప్రగడ శ్రీనివాస్‌రావు(దొరవారు) గ్రామంలో 30 సంవత్సరాలు సర్పంచ్‌గా అనంతరం లోయపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ బంగ్లాను శ్రీనివాస్‌రావు తండ్రి శ్రీ ప్రగడ సింఘల్‌రావు కట్టించారు. ప్రస్తుతం శ్రీనివాస్‌రావు కుమారుడు శ్రీ ప్రగడ వేణుగోపాల్‌రావు పీఏసీఎస్ డైరెక్టర్‌గా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు. లోయపల్లి గ్రామంలో ఆకర్షణగా నిలిచిన దొరవారి బంగ్లాకు తాజాగా వందేళ్లు పూర్తయ్యాయి. అయితే ఆనాటి కళాత్మకత ఇప్పటికీ ఆ బంగ్లాలో ఉట్టిపడుతూనే ఉంది.

- మంచాల

మహిళ దారుణ హత్య

ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం

- క్లూస్ టీంతో ఆధారాలు సేకరించిన పోలీసులు
- నాలుగు బృందాలతో నిందితుడి కోసం గాలింపు



హత్యకు గురైన బొజ్జమ్మ (ఫైల్)

మీర్‌పేట: మహిళను దారుణంగా హతమార్చి, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన సంఘటన మీర్‌పేట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్లుకు చెందిన బొజ్జమ్మ (55) మీర్‌పేట బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఇండో అమెరికన్ స్కూల్‌లో వాచ్ ఉమెన్‌గా పని చేసేది. ఏడాది క్రితమే ఈ పాఠశాల మూతపడగా.. స్కూల్ ఆవరణలోని ఓ గదిలో ఒంటరిగా నివాసముంటోంది. ఈమె భర్త లింగమయ్య అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవాడు. ఇదిలా ఉండగా బొజ్జమ్మ చెల్లెలి కొడుకు ఆంజనేయులు సైతం తరచూ వచ్చి యోగక్షేమాలు తెలుసుకునేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం 11 గంటలకు బొజ్జమ్మ వద్దకు వచ్చిన ఆంజనేయులు తిరిగి 11.30కు వెళ్లిపోయాడు. అనంతరం ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని స్థానికులు గమనించారు. అక్కడకు వెళ్లి చూడగా.. రక్తగాయాలైన బొజమ్మ అచేతనంగా పడి ఉండటం, ఒంటిపై కాల్చిన దుప్పటి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బొజ్జమ్మ వద్ద ఉన్న వెండి కడియాలు, పట్టీలు, బంగారు ముక్కుపుడక కోసమే.. ఆంజనేయులు ఆమెతో గొడవ పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మృతురాలి ముఖానికి దుస్తులు చుట్టి సుత్తెతో దాడి చేసి, చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత దుప్పటికి నిప్పంటించి ఆమెపై వేసి పారిపోయినట్లు భావిస్తున్నారు. ఉదయం వచ్చిన సమయంలో మాస్కు ధరించిన అతను తిరిగి వెళ్లే సమయంలో దుస్తులు మార్చుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డయిందని పోలీసులు చెప్పారు. బొజ్జమ్మను హత్య చేసిన తర్వాత 'నా చావుకు నా భర్తే కారణం' అని రాసిన ఆంజనేయులు బొజ్జమ్మే స్వయంగా ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిత్రీకరించేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. మృతురాలి కాలు పాక్షికంగా కాలిపోయిందని తెలిపారు. బొజ్జమ్మకు పిల్లలు లేరని, కేసు నమోదు చేసుకుని బాడీని పోస్టుమార్టం కోసం నిమిత్త ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని వెల్లడించారు. ఆంజనేయులు 15 ఏళ్ల క్రితమే భార్యను వదిలేశాడని, ఇతన్ని పట్టుకునేందుకు నాలుగు బృందాలతో గాలిస్తున్నామని స్పష్టంచేశారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ సాయిశ్రీ

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న పోలీసు

ఆమనగల్లు: సెల్‌ఫోన్ పోయిందని బాధితుల నుంచి ఫిర్యాదును అందుకున్న పోలీసులు వెతికి పెట్టి బాధితులకు ఫోన్ అప్పగించారు. వివరాలు.. ఆమనగల్లు పట్టణం గుర్రంగుట్ట కాలనీకి చెందిన ఓ విద్యార్థి స్థానిక లిటిల్ స్కాలర్ స్కూల్లో చదువుకుంటున్నాడు. కాగా తల్లిదండ్రులకు తెలియకుండా 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఫొటోలు దిగేందుకు పాఠశాలకు ఇంట్లోని సెల్‌ఫోన్‌ను తీసుకువచ్చాడు. అదేరోజున మాడ్గుల వెళ్లే దారిలో పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో విద్యార్థి ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులు ఆమనగల్లు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బలరాంనాయక్ విచారణ చేపట్టి సీసీ కెమెరాల సాయంతో పట్టణంలో శ్రీనివాస్‌కాలనీలోని ఓ యువకుడి వద్ద సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ తీసుకుని విద్యార్థి తల్లి మూడావత్ భారతికి గురువారం కానిస్టేబుల్ శివకుమార్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులకు భారతి కృతజ్ఞతలు తెలిపింది.

39 కేసులు.. 15 సార్లు జైలు

అయినా తీరు మారలేదు..



నిందితుడు మహ్మద్ సద్దాం

హిమాయత్‌నగర్: ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా అతడిపై 39 కేసులు. ఇప్పటి వరకు దాదాపు 15 పర్యాయాలు జైలుకు వెళ్లొచ్చాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. చైన్ స్నాచింగ్‌లు చేస్తూనే ఉన్నాడు.

ఇటీవల నారాయణగూడ పోలీసుస్టేషన్‌లో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి మెడలో నుంచి బంగారు చైన్‌ను దొంగలించిన ఘటనలో మరోసారి జైలు పాలయ్యాడు. రంగారెడ్డి జిల్లా చిన్న మంగళారం గ్రామానికి చెందిన బ్యాగరి పోచయ్య ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని ఓ కారు షోరూంలో హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్‌గా చేస్తున్నాడు. బుధవారం ఇంటి నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరిన పోచయ్య మెహిదీపట్నంలో బస్సు దిగి అక్కడి నుండి 113ఎస్ బస్సులో క్రాస్ రోడ్‌కు బస్సు ఎక్కాడు. నారాయణగూడ బస్టాప్ వద్దకు రాగానే అతని మెడలో ఉన్న 1.5 తులాల గోల్డ్ చైన్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురై నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా చైన్‌ను దొంగిలించింది పాత నేరస్తుడు మహమ్మద్ సద్దాంగా గుర్తించారు. గురువారం ఓల్డ్ సిటీ టపాచబుత్రలోని అతని ఇంట్లో అరెస్టు చేశారు. గోల్డ్ చైన్‌ను రికవరీ చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ చెప్పారు. నిందితుడిపై గతంలో పీడీ యాక్ట్ కూడా నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు..

- నేను ప్రిన్స్ ముఖరంజా వారసురాలినే..
- జైరిన్ ముఖరంజా



బంజారాహిల్స్: తాను ప్రిన్స్ ముఖరంజా కూతుర్ని కాదని కొంతమంది సమాజంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నకిలీ డీఎన్ఏ రిపోర్ట్ సోషల్ మీడియాలో చలామణి చేస్తున్నారని ప్రిన్స్ ముఖరంజా బహదూర్ కూతురు జైరిన్ ముకరంజా ఆరోపించారు. గురువారం బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను ప్రిన్స్ ముఖరంజా, ప్రిన్సెస్ జమీలా బౌలారాస్‌లకు 1994 జూలై 6న జన్మించానని అన్నారు. తన తల్లి జమీలా 1993 సెప్టెంబర్ 8న ముఖరంజాను పెళ్లి చేసుకున్నారని అన్నారు. వారిద్దరి పెళ్లి సర్టిఫికెట్, తన బర్త్ సర్టిఫికెట్‌లను ఈ సందర్భంగా ఆమె విలేకరుల ఎదుట ప్రదర్శించారు. డీఎన్ఏ రిపోర్టును కూడా ప్రదర్శించిన ఆమె తన వద్ద అన్ని పత్రాలు ఉన్నాయన్నారు. తాను ముఖరంజా కూతురినని, ఇందుకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని, తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్: మహాధర్నాలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: అర్హులందరికీ వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పలుపు మేరకు గురువారం షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నేతలు నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇళ్లులేని నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకపోగా.. ప్రస్తుతం మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో స్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు మంజూరు చేస్తామని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎంతోమంది నిరుపేదలు ఇళ్లులేక పూరిగుడిసెల్లో నివసిస్తున్నారని.. వారందరు ప్రభుత్వం పంపిణీ చేసే డబుల్ బెడ్‌రూం ఇళ్లకోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా అర్హులకు కేటాయించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని మండిపడ్డారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 1864 ఇళ్లు నిర్మించినా నేటికి లబ్ధిదారులకు పంపిణీ చేయలేదని అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓట్ల కోసం రాజకీయాలు చేయడం తప్ప నిరుపేదలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు.. విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, మిథున్‌రెడ్డి, అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, వెంకటేష్, మురళి, అశోక్, వెంకటేష్, మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, శ్రీనివాస్‌చారి, నర్సింహ, బాల్‌రాజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడదాం..

కొత్తూరు: హామీల అమలులో బీఆర్ఎస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలచారి ఆరోపించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి ఆధ్వర్యంలో కొత్తూరు పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం గోపాలచారి పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహగౌడ్, నాగరాజుచారి, రణధీర్‌గౌడ్, మాణిక్యం, రమేష్, శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఆపరేటర్‌పై సస్పెన్షన్ వేటు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింహయ్యను సస్పెండ్ చేస్తూ ట్రాన్స్‌కో షాద్‌నగర్ డీఈ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నాడంటూ అతడిని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విధుల్లో ఉన్నప్పుడు కూడా మద్యం సేవించి ఇష్టానుసారంగా వ్యవహరించేవాడని నర్సింహయ్య మీద ఆరోపణలు ఉన్నాయి.

మరణంలోనూ తోడుగా..

- భర్త మరణవార్త విన్న వెంటనే గుండెపోటుతో భార్య మృతి
- తిమ్మాపూర్‌లో విషాదఛాయలు



శంకరయ్యగౌడ్, శాంతమ్మ (ఫైల్)

కొత్తూరు: భర్త మృతి వార్త తెలిసిన గంట వ్యవధిలోనే భార్య గుండెపోటుతో మృతి చెందిన హృదయ విదారక సంఘటన స్టేషన్ తిమ్మాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పీర్లగూడెం శంకరయ్యగౌడ్(67), శాంతమ్మ(60) భార్యభర్తలు. ఇటీవల శంకరయ్యగౌడ్‌కు గుండె సంబంధిత శస్త్ర చికిత్స జరిగింది. ఈ క్రమంలో ఇటీవల శంకరయ్యగౌడ్ మరోసారి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకరయ్యగౌడ్ ఆరోగ్యం విషమించడంతో గురువారం మృతి చెందాడు. భర్త మృతి వార్తను జీర్ణించుకోలేని భార్య శాంతమ్మ గంట వ్యవధిలో ఇంట్లోనే కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెనొప్పితో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎప్పుడూ అన్యోన్యంగా మెలిగే భార్యభర్తలు మరణంలోనూ ఒకటిగా వెళ్లారనే వార్త కుటుంబసభ్యులతో పాటు బంధువులను కలిచివేసింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

మణికొండ: మద్యం మత్తులో వాహనాలు నడిపి ట్రాఫిక్ పోలీసులకు చిక్కిన ఇద్దరికి రాజేంద్రనగర్ కోర్టు జైలు శిక్షను విధించినట్టు నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ చేపట్టగా అందులో మద్యం తాగి చిక్కిన గణేష్‌కు 3 రోజుల జైలు శిక్షతో పాటు రూ. 3500ల జరిమానా విధించిందన్నారు. మరో వ్యక్తి రాంచందర్‌కు 3 రోజుల జైలు, రూ. 5వేల జరిమానా విధించిందని పేర్కొన్నారు.

పోల్కంపల్లి పోలీస్

- కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా ఉద్యోగం
- పట్టుపట్టి పెద్ద కొలువు సాధించిన పేదింటి బిడ్డ
- తల్లి దినసరి కూలీ.. తండ్రి గీత కార్మికుడు
- యువతకు ఆదర్శంగా వంశీగౌడ్



తల్లిదండ్రులతో వంశీగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధిలోని పోల్కంపల్లికి చెందిన వంశీగౌడ్ కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా ఉద్యోగం సాధించాడు. గ్రామానికి చెందిన గుండ్ల నాగమణి దర్శన్‌గౌడ్ దంపతులకు వంశీ, మానస ఇద్దరు సంతానం. నాగమణి కూలీ పని చేస్తుండగా, దర్శన్‌గౌడ్ గీత కార్మికుడు. ఇద్దరు పిల్లలను ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదివించారు. వంశీగౌడ్ చిన్ననాటి నుంచి చదువుపై ఆసక్తి చూపేవాడు. 2014లో పదో పాసయ్యాడు. హస్తినాపురం (2016)లో ఇంటర్, నిజాం కాలేజీ (2019)లో డిగ్రీ పూర్తి చేశాడు. డిగ్రీ చదువుతుండగా ఎన్‌సీసీలో చేరి సీ సర్టిఫికెట్ సాధించాడు. 2019లో కానిస్టేబుల్ నోటిఫికేషన్ రావడంతో తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాడు. అంతటితో ఆగకుండా నిత్యం డ్యూటీ ముగిసిన తర్వాత ఇంటికి వచ్చి చదువుపై శ్రద్ధ పెట్టాడు. ఇటీవల నిర్వహించిన ఎస్ఐల భర్తీలోనూ మొదటి ప్రయత్నంలోనే ఎన్‌సీసీ కోటాలో సివిల్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. మొక్కవోని దీక్షతో కష్టపడి కఠోరంగా చదవడంతోనే కల సాకారమైందని వంశీ చెబుతున్నారు. తమ మామయ్యతో పాటు అమ్మ తరఫు బంధువులు, బాబాయి సైతం పోలీసు కానిస్టేబుళ్లుగా పని చేస్తున్నారు. వీరి స్ఫూర్తితో ఎలాగైనా ఎస్ఐ సాధించాలని గట్టిగా నిర్ణయించుకుని, ఆదిశగా అలుపెరకుండా శ్రమించాడు. తన తల్లిదండ్రుల కష్టానికి తగిన గుర్తింపు తేవాలనే ఏకైక లక్ష్యంతోనే ముందుకు సాగానని చెబుతున్నారు.

గొర్రెల పంపిణీపై కాలయాపన తగదు

జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

కడ్తాల్: గొల్లకుర్మలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెండో విడుత గొర్రెల పంపిణీ చేపట్టాలని, గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు గొర శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బీరప్ప ఆలయంలో.. మండల గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. గొల్లకుర్మల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన ఏ పార్టీలైనా వారిని మోసం చేస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గొల్లకుర్మలకు రెండో విడుత గొర్రెల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. నేటికీ పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నగదు బదిలీతో రెండో విడుత గొర్రెల పంపిణీని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు కోసం ఈనెల 22న కడ్తాల్ మండల కేంద్రంలో గొర్రెకాపరుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు పెద్దసంఖ్యలో గొల్లకుర్మలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య, సహాయ కార్యదర్శి మల్లేశ్, సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు యాదయ్య, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, జిల్లా కమిటీ సభ్యులు మల్లేశ్, వివిధ గ్రామాల సంఘాల అధ్యక్షుడు మల్లయ్య, శ్రీను, సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



గొర్లకుర్మ సంఘం నేతలతో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం